సగం మంది సభ్యులే హాజరు

• సమస్యలపై ప్రశ్నించింది ముగ్గురే • పెగడపల్లి సర్వసభ్య సమావేశం తీరు



మాట్లాడుతున్న ఎంపీపీ శోభ

పెగడపల్లి: మండల సర్వసభ్య సమావేశం శనివారం పెగడపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గోలి శోభ అధ్యక్షతన నిర్వహించారు. జెడ్పీటీసీ రాజేందర్‌రావు, ఏఎంసీ చైర్మన్ నిర్మల ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మొత్తం 14 మంది ఎంపీటీసీ సభ్యులకు గాను ఎంపీపీతో కలిపి ఏడుగురు, 23 మంది సర్పంచ్‌లుండగా 9 మందే హాజరయ్యారు. మన ఊరు–మన బడి కింద చేపట్టిన పాఠశాలల అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపు, కొత్త రేషన్ కార్డుల మంజూరు లేకపోవడం, ఉన్న కార్డుల్లో కొత్తగా పేర్లు నమోదు చేయకపోవడం, బోధకాలు వ్యాధిగ్రస్తులకు పెన్షన్ రాకపోవడంపై బతికపల్లి సర్పంచ్ శోభారాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. రేషన్ కార్డులు, పేర్ల నమోదు తమ పరిధిలో లేదని తహసీల్దార్ ఎంఏ ఫరూక్ బదులిచ్చారు. మండల విద్యాధికారి లేక పాఠశాలల పరిస్థితి అధ్వానంగా మారిందని ల్యాగలమర్రి ఎంపీటీసీ సభ్యుడు అంజయ్య అన్నారు. మండల పరిషత్ గ్రాంట్ నుంచి మురికి కాల్వ నిర్మించి నెలలు గడుస్తున్నా ఎంబీ రికార్డు ఎందుకు చేయడం లేదని ఎల్లాపూర్ ఎంపీటీసీ సభ్యుడు కొత్తపల్లి రవి ప్రశ్నించారు. మిగతా సభ్యులు కిమ్మనకుండా కూర్చున్నారు. గ్రామాల అభివృద్ధికి మంత్రి ఈశ్వర్ నిధులు కేటాయిస్తున్నారని, పనులు పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ, జెడ్పీటీసీ ఆదేశించారు. వైస్ ఎంపీపీ గంగాధర్, ఎంపీడీవో పుల్లయ్య, తహసీల్దార్ ఎంఏ.రఫీక్, ఎంపీవో మహేందర్, వైద్యాధికారులు నరేశ్, శ్రీకాంత్, ఏవో వినీల, వివిధ శాఖల ఏఈలు తదితరులున్నారు.

అధికారులు రాకపోవడంపై ఆగ్రహం

• సమస్యలు ఎవరికి చెప్పుకోవాలంటూ సభ్యుల మండిపాటు • ధర్మపురి సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ చిట్టిబాబు

ధర్మపురి: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ చిట్టిబాబు అధ్యక్షతన ధర్మపురి మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమయపాలన పాటించకపోవడంతో ముందుగా వచ్చిన సర్పంచ్‌లు, అధికారులు గంటల తరబడి నిరీక్షించారు. మధ్యాహ్నం 1 గంట వరకు ఆరుగురు ఎంపీటీసీ సభ్యులు హాజరు కావడంతో సమావేశం ప్రారంభించారు. విద్య, వైద్యం, మిషన్ భగీరథ, నీటిపారుదల తదితర సమస్యలను సభ్యులు సొల్ల నరేశ్, మెడపట్ల దుబ్బయ్య, రెడ్డనేని సత్యం, కాల్ల సత్య లేవనెత్తారు. సమాధానం చెప్పేందుకు ఉన్నతాధికారులు రాకపోవడంతో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలంటూ మండిపడ్డారు. అధికారుల గైర్హాజరు విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఎంపీపీ తెలిపారు. సర్వసభ్య సమావేశానికి సభ్యులు తప్పక హాజరు కావాలని, సమస్యల పరిష్కారానికి మంత్రి కొప్పుల ఈశ్వర్ సహకారంతో కృషి చేస్తామన్నారు. అనంతరం రూ.లక్షలోపు రుణమాఫీ, 1 నుంచి 10వ తరగతి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉదయం అందించనున్న అల్పాహారంపై తీర్మానాలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. జెడ్పీటీసీ సభ్యుడు బత్తిని అరుణ, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎంపీవో నరేశ్‌ తదితరులున్నారు.

బిల్లులు చెల్లించకపోవడం దారుణం

• సభ్యుల ఆవేదన • కథలాపూర్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ రేవతి

కథలాపూర్: గ్రామాల్లో అభివృద్ధి పనులు చేస్తే ఏళ్లుగా బిల్లులు చెల్లించకపోవడం దారుణమని పలువురు సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. కథలాపూర్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం ఎంపీపీ జవ్వాజి రేవతి అధ్యక్షతన జరిగింది. ఇంకుడు గుంతలు 2021లో, క్రీడాప్రాంగణం 6 నెలల క్రితం నిర్మించామని, ఇప్పటికీ బిల్లులు రాలేదని దూలూర్ సర్పంచ్ దయ్య లక్ష్మీనర్సయ్య మండిపడ్డారు. బిల్లుల రికార్డులను ఉన్నతాధికారులకు పంపించామని ఏపీవో రాజేందర్ సమాధానమిచ్చారు. కలిగోట శివారు గిరిజన తండాలో మిషన్ భగీరథ పథకం నీళ్లు నాలుగేళ్లుగా రావడం లేదని సర్పంచ్ సరోజ తెలిపారు. నీళ్లు వచ్చేలా చూడాలని ఎంపీపీ ఏఈలకు సూచించారు. ఇటీవలి భారీ వర్షాలకు 6 గ్రామాల్లో చెరువులకు, కుంటలకు నష్టం జరిగిందని పలువురు సభ్యులు ప్రస్తావించగా.. రూ.2.53 కోట్లతో ప్రతిపాదనలు పంపించామని నీటిపారుదల శాఖ ఏఈ శ్రీనివాస్ పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు యథావిధిగా నిర్వహించేందుకు ప్రజాప్రతినిధులు సహకరించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక కోరారు. ఎంపీడీవో జనార్దన్, వైస్ ఎంపీపీ కిరణ్‌రావు, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు గంగారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు బాదినేని రమేశ్, శిరీష, దేవేంద్ర, లక్ష్మి, సర్పంచ్‌లు గోపు శ్రీనివాస్, జలంధర్, అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

'మహిళా' భవనాలకు రూ.4 కోట్లు మంజూరు

ధర్మపురి: నియోజవర్గంలోని 6 మండలాల్లో 80 మహిళా సంఘాల భవనాలు నిర్మించేందుకు రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ చొరవతో రూ.4 కోట్లు మంజూరయ్యాయి. ఒక్కో భవనానికి రూ.5 లక్షల చొప్పున మంజూరైనట్లు మంత్రి ఒక ప్రకటనలో తెలిపారు. ధర్మపురి మండలంలో 14 సంఘాలకు రూ.70 లక్షలు, గొల్లపల్లిలో 17 సంఘాలకు రూ.85 లక్షలు, బుగ్గారంలో 7 సంఘాలకు రూ.35 లక్షలు, వెల్గటూర్‌లో 22 సంఘాలకు రూ.1.10 కోట్లు, పెగడపెల్లిలో 10 సంఘాలకు రూ.50 లక్షలు, ధర్మారంలో 10 సంఘాలకు రూ.50 లక్షలు మంజూరయ్యాయని పేర్కొన్నారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

రాయికల్: వినాయక విగ్రహాలను విక్రయించే ఓ వ్యక్తి గుండెపోటుతో మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. కోరుట్ల పట్టణానికి చెందిన కొమ్ముల వెంకటి (48) వినాయక చవితి సందర్భంగా రాయికల్ పట్టణంలోని సర్దార్ వల్లభాయ్‌పటేల్ విగ్రహం సమీపంలో దుకాణం పెట్టుకొని, విగ్రహాలను విక్రయిస్తున్నాడు. శనివారం మధ్యాహ్నం భోజనం చేస్తున్న సమయంలో గుండెపోటు రావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, నలుగురు కుమారులు ఉన్నారు.

పోలీసుల అదుపులో జగిత్యాల యువకులు

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రానికి చెందిన ఇద్దరు యువకులను హైదరాబాద్ సైబర్‌క్రైం పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. వారి వివరాల ప్రకారం.. జగిత్యాల చిలుకవాడకు చెందిన షేక్ అక్తరొద్దీన్ ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగామ్‌లలో హైదరాబాద్‌కు చెందిన ఇద్దరికి మాయమాటలు చెప్పి, వారి నుంచి డబ్బులు కాజేశాడు. పురాణిపేటకు చెందిన అనుదీప్ ఓ యువతితో ఇన్‌స్టాగామ్, ఫేస్‌బుక్‌లలో స్నేహం చేసి, ఆమె ఫొటోలను తెప్పించుకొని మార్ఫింగ్ చేశాడు. అనంతరం బ్లాక్‌మెయిల్ చేసి, సుమారు రూ.3 లక్షల వరకు వసూలు చేశాడు. దీంతో బాధితులు అక్కడి సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. శనివారం సాయంత్రం జగిత్యాల పట్టణ పోలీసుల సహాయంతో నిందితులిద్దరినీ అదుపులోకి తీసుకొని, హైదరాబాద్ తరలించారు.

ప్రజారోగ్యం మెరుగుపర్చేందుకు చర్యలు

మెట్‌పల్లిరూరల్: ప్రజారోగ్యం మెరుగుపర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మెట్‌పల్లి ఎంపీపీ మారు సాయిరెడ్డి అన్నారు. మెట్‌పల్లి పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జన ఆరోగ్య సమితి సమావేశం నిర్వహించారు. ప్రజలకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు.

కాంగ్రెస్ విజయభేరి సభకు తరలిరావాలి

మెట్‌పల్లిరూరల్: తుక్కుగూడలో ఆదివారం నిర్వహించే కాంగ్రెస్ విజయభేరి సభకు తరలిరావాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు కాటిపెల్లి శ్రీనివాస్‌రెడ్డి కోరారు. శనివారం మెట్‌పల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. నాయకులు పరంధాం, నందు,హరీశ్‌, ఇర్ఫాన్ తదితరులున్నారు.

బీసీ హక్కుల సాధన సమితి సదస్సుకు రండి

ఇబ్రహీంపట్నం: బీసీ హక్కుల సాధన కోసం ఈ నెల 20న ప్రభాకర్ స్మారక గ్రంథాలయం వద్ద నిర్వహించే బీసీ హక్కుల సాధన సమితి సదస్సును విజయవంతం చేయాలని సమితి కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి చెన్న విశ్వనాథం కోరారు. శనివారం ఇబ్రహీంపట్నంలోని సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద సంబంధిత కరపత్రాలను ఆవిష్కరించారు. దేశ జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలు సామాజిక న్యాయానికి నోచుకోవడం లేదన్నారు. హక్కుల సాధన కోసం రాజకీయాలకు అతీతంగా సమైక్య పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. నాయకులు లింబాద్రి, దినేశ్, శ్రీనివాస్, వెంకటనర్సయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె



జ్వరంతోనే నిరసన తెలుపుతున్న టీచర్లు

పెగడపల్లి: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు శనివారం మోకాలిపై కూర్చొని, నిరసన తెలిపారు. బీజేపీ మండల అధ్యక్షుడు గంగుల కొమురెల్లి, నాయకులు వారికి మద్దతు తెలిపారు. అంగన్‌వాడీల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

జ్వరాలు వచ్చినా సమ్మెలోనే..

రాయికల్: సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు చేస్తున్న సమ్మె శనివారం కొనసాగింది. పలువురు టీచర్లు జ్వరం వచ్చినా నిరసన తెలిపారు.

ఎమ్మెల్యే రవిశంకర్‌కు వినతి

మల్యాల: సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ సౌకర్యం కల్పించాలని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు కోరారు. శనివారం చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌ను ఆయన క్యాంపు క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందించారు. ఆయన సానుకూలంగా స్పందించి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారని పేర్కొన్నారు.

'ఎమ్మెల్సీని విమర్శించడం హాస్యాస్పదం'

జగిత్యాల: రాజకీయంగా ఎదగడం కోసమే బీజేపీ రాష్ట్ర నాయకురాలు శ్రావణి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిపై విమర్శలు చేస్తున్నారని జగిత్యాల మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు జిల్లా విజయలక్ష్మి అన్నారు. శనివారం జగిత్యాలలో ఆమె విలేకరులతో మాట్లాడారు. బీసీలపై కపట ప్రేమ ప్రదర్శిస్తున్న శ్రావణి పదవిలో ఉన్నప్పుడు మోసాలను దాచిపెట్టారని ఆరోపించారు. ఆమె ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని విమర్శించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రోల్లవాగు ఎవరికి ఏటీఎం ఎవరికి పేటెంట్ అనేది బీర్‌పూర్ ప్రజలను అడిగి తెలుసుకోవాలని సూచించారు. రాజకీయంలో హత్యలు ఉండవు, ఆత్మహత్యలే ఉంటాయన్నారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి నిజాయితీని మంత్రి కేటీఆర్, అర్వింద్ మెచ్చుకున్నారని తెలిపారు. సీఎం కేసీఆర్ కూడా ఆయనకు గౌరవం ఇస్తారని, మీరు విమర్శించడాన్ని మీ విజ్ఞతకే వదిలేస్తున్నామని అన్నారు. నాయకులు దుర్గయ్య, గాజుల రాజేందర్, శ్రీను, లత, చాంద్‌పాషా, ముజీబ్ పాల్గొన్నారు.

'మధ్యాహ్న' కార్మికుల డిమాండ్లు నెరవేర్చండి

మధ్యాహ్న భోజన కార్మికుల డిమాండ్లను నెరవేర్చాలని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి అన్నారు. శనివారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులకు మద్దతు తెలిపారు. బకాయిలు చెల్లించలేని వారు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు టిఫిన్ ఎలా పెడతారో చెప్పాలన్నారు. ప్రభుత్వం ప్రకటనలకే పరిమితమైందని, ఆచరణలో శూన్యమని విమర్శించారు. కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

'విమోచనం' అధికారికంగా నిర్వహించాలి



కోరుట్లలో బైక్ ర్యాలీ తీస్తున్న నాయకులు

కోరుట్ల/మెట్‌పల్లి: తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని కోరుతూ బీజేపీ ఆధ్వర్యంలో శనివారం కోరుట్లలో బైక్ ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర నాయకుడు సురభి నవీన్‌కుమార్ మాట్లాడుతూ.. బీజేపీ అధికారంలోకి రాగానే విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తామని తెలిపారు. మెట్‌పల్లి పట్టణంలోనూ బైక్ ర్యాలీ నిర్వహించారు. విమోచన దినోత్సవాన్ని కేంద్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు నిర్వహించడం లేదని ప్రశ్నించారు. కోరుట్ల పట్టణ అధ్యక్షులు దాసరి రాజశేఖర్, నాయకులు పాల్గొన్నారు.

చంపుతామని బెదిరించిన వారిపై కేసు

జగిత్యాల క్రైం: జగిత్యాల అర్బన్ మండలం తిప్పన్నపేటకు చెందిన ముద్దసాని రాధను చంపుతామని బెదిరించిన అదే గ్రామానికి చెందిన చిన్న గంగయ్య, రాధ, అశోక్‌లపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై శంకరయ్య తెలిపారు. ఈ ముగ్గురూ శనివారం సాయంత్రం రాధకు చెందిన వ్యవసాయ భూమి హద్దులను తొలగించారన్నారు. ఆమెను అసభ్య పదజాలంతో దూషిస్తూ చంపుతామని బెదిరించారని పేర్కొన్నారు. బాధితురాలి ఫిర్యాదు వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నర్సింగాపూర్‌లో ఇద్దరిపై..

జగిత్యాల రూరల్ మండలంలోని నర్సింగాపూర్ గ్రామానికి చెందిన నేరెల్ల రాజశేఖర్‌పై దాడికి ప్రయత్నించిన అదే గ్రామానికి చెందిన బక్కశెట్టి గణేశ్, లక్ష్మిలపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఏఎస్సై శంకరయ్య తెలిపారు. గోడ విషయంలో వారు గొడవ పడ్డారన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

గోడ కూల్చిన వ్యక్తిపై..

జగిత్యాల రూరల్ మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన గిద్దె తిరుపతి గోడను కూల్చిన గిద్దె శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై శంకరయ్య తెలిపారు. తిరుపతి తన వాటాగా వచ్చిన భూమిలో శనివారం గోడ నిర్మిస్తుండగా శ్రీనివాస్ కూల్చివేయడంతోపాటు అతనిపై దాడి చేశాడన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఉపాధి రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న వికాస్‌రావు

కథలాపూర్: ఎన్నో ఉద్యమాలతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం.. అందరి తెలంగాణగా మారితేనే గ్రామాలు సంపూర్ణ అభివృద్ధి సాధిస్తాయని ప్రతిమ ఆసుపత్రి వైద్యుడు చెన్నమనేని వికాస్‌రావు, దీప అన్నారు. ప్రతిమ ఫౌండేషన్ ద్వారా రూ.3 లక్షలతో ఏర్పాటు చేయించిన వైకుంఠ రథాన్ని శనివారం పెగ్గెర్ల గ్రామానికి వితరణ చేశారు. యువత, మహిళలు ఉపాధి రంగాల్లో రాణించాలని సూచించారు. సర్పంచ్‌లు జవిడి ప్రతాప్‌రెడ్డి, కంటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఇంజినీర్లకు సన్మానం

కోరుట్ల: పట్టణంలో ఇంజినీర్స్ డే సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ కోరుట్ల, లయన్స్ క్లబ్ ఆఫ్ కోటి నవదుర్గ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ఇంజినీర్లను సన్మానించారు. కోరుట్ల ఇంజినీర్స్ అండ్ ఆర్కిటెక్చర్ అసోసియేషన్ అధ్యక్షుడు బచ్చువాల సంజీవ్, కార్యదర్శి గట్ల నరేశ్, కోశాధికారి ఆడెపు ప్రదీప్, సభ్యులను సత్కరించారు. కోటి నవదుర్గ అధ్యక్షుడు వనపర్తి చంద్రమోహన్, వనపర్తి రమ్య తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలపై సదస్సు

ధర్మపురి: బ్యాంకుల వ్యవహారాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ శ్రీనివాస్ తెలిపారు. నేరెల్ల అరబిందో పాఠశాలలో శనివారం బ్యాంకు సేవలు, వ్యవహారాలపై సదస్సు నిర్వహించారు. బ్యాంకు ఖాతాలు, పొదుపు, వడ్డీ రేట్లు, బీమా తదితర అంశాలను వివరించారు. పాఠశాల ప్రిన్సిపాల్ రవీందర్ తదితరులున్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

మేడిపెల్లి: మేడిపెల్లి, భీమారం మండలాల్లోని ఎరువుల దుకాణాల్లో మండల వ్యవసాయ అధికారి త్రివేదిక శనివారం తనిఖీలు నిర్వహించారు. భీమారం కేడీసీఎంఎస్, కాచారం ఏఆర్ఎస్ కే, పోరుమల్ల పీఏసీఎస్‌లలో రిజిష్టర్లు పరిశీలించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గల్ఫ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి

మల్లాపూర్: గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే గల్ఫ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని గల్ఫ్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు గుగ్గిళ్ల రవిగౌడ్ డిమాండ్ చేశారు. శనివారం చిట్టాపూర్‌లో జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన గల్ఫ్ కార్మికుల అవగాహన చైతన్య యాత్రలో పాల్గొన్నారు. సర్పంచ్ సాయికుమార్, గల్ఫ్ జేఏసీ నాయకులున్నారు.

20న మల్లాపూర్ సర్వసభ్య సమావేశం

మల్లాపూర్: స్థానిక ఎంపీడీవో కార్యలయంలో ఈ నెల 20న మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీపీ కాటిపెల్లి సరోజన అధ్యక్షతన మల్లాపూర్‌మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జగదీశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు హాజరవుతారన్నారు. ప్రభుత్వ శాఖల పనితీరు, మండల అభివృద్ధి, సమస్యలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

జై గణేశ భక్త సమితి మండల అధ్యక్షుడిగా విష్ణువర్ధన్‌రాజ్

మల్లాపూర్: జై గణేశ భక్త సమితి మండల అధ్యక్షుడిగా గణపతి విష్ణువర్ధన్‌రాజ్ (చిట్టాపూర్)ను నియమించినట్లు సంఘం వ్యవస్థాపకుడు జైన్ కుమార్ తెలిపారు. శనివారం ఆయనకు నియామక పత్రం అందించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలకు అనుగుణంగా వినాయక మండపాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమితి సభ్యులందరూ ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. భక్తులందరూ వినాయకుడి మట్టి విగ్రహాలనే ప్రతిష్ఠించాలని కోరారు.

'ఉద్యోగులు, పెన్షనర్ల పరిస్థితి అధ్వానం'

మెట్‌పల్లి: బీఆర్ఎస్ పాలనలో ఉద్యోగులు, పెన్షనర్ల పరిస్థితి అధ్వానంగా తయారైందని మాజీ ఎమ్మెల్యే కొమొరెడ్డి జ్యోతి ఒక ప్రకటనలో ఆరోపించారు. డీఏను సకాలంలో చెల్లించాల్సిన ప్రభుత్వం తాత్సారం చేయడం తగదన్నారు.

బీజేపీని అధికారంలోకి తీసుకురావాలి

సారంగాపూర్: ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ బీజేపీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పని చేయాలని పార్టీ రాష్ట్ర నాయకుడు ముదుగంటి రవీందర్‌రెడ్డి అన్నారు. శనివారం బీర్‌పూర్ మండలంలో పర్యటించారు. నర్సింహులపల్లెకు చెందిన కందుకూరి శంకర్ మృతిచెందగా బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

మహిళా సంక్షేమానికి ప్రాధాన్యం

కథలాపూర్: కాంగ్రెస్ హయాంలో మహిళా సంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చామని ఆ పార్టీ మహిళా విభాగం మండల అధ్యక్షురాలు పులి శిరీష అన్నారు. శనివారం కథలాపూర్ మండలంలోని భూషణరావుపేటలో ఇంటింటికీ కాంగ్రెస్ డిక్లరేషన్ కరపత్రాలు పంపిణీ చేశారు. అధికారంలోకి వస్తే గ్యాస్ సిలిండర్‌ను రూ.500కే ఇస్తామన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఉంటుందని, రూ.5లక్షల వరకు ఉచితంగా కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తామని పేర్కొన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లు పంపిణీ చేయాలి

బుగ్గారం: చిన్నాపూర్‌లో నూతనంగా నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను అర్హులకు వెంటనే పంపిణీ చేయాలని బీజేపీ నాయకుడు దూడ మహిపాల్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇళ్లు నిర్మించి చాలా కాలం అవుతున్నా ఇవ్వకపోవడం సరికాదన్నారు. మంత్రి కొప్పుల ఈశ్వర్ స్పందించి, పంపిణీ చేసేలా అధికారులను ఆదేశించాలని కోరారు.

మధ్యాహ్నం ప్రారంభం.. గంటలో ముగింపు

• మొక్కుబడిగా బుగ్గారం మండల సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ రాజమణి

బుగ్గారం: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం బుగ్గారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ బాదినేని రాజమణి అధ్యక్షతన మొక్కుబడిగా నిర్వహించారు. మధ్యాహ్నం 2.30 గంటలకు ప్రారంభమైన సమావేశం కేవలం గంటలోనే ముగిసింది. వెల్గొండ సర్పంచ్ గాదె తిరుపతి మాట్లాడుతూ.. మండలంలో యూరియా కొరత ఉందని తెలిపారు. గృహలక్ష్మి లబ్ధిదారుల ఎంపికలో సర్పంచ్‌లకు ప్రాధాన్యం ఇవ్వాలని మద్దునూర్ సర్పంచ్ బత్తుల తిరుపతి కోరారు. బుగ్గారం ఎక్స్‌రోడ్డు వద్ద ఎక్స్‌ప్రెస్ బస్సులను ఆపాలని కోరినా ఆర్టీసీ అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు సభ్యులు పేర్కొన్నారు. జెడ్పీటీసీ బాదినేని రాజేందర్ మాట్లాడుతూ.. బుగ్గారం మండలాన్ని మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రత్యేక చొరవతో తక్కువ సమయంలోనే అభివృద్ధి చేసుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన పీహెచ్‌సీని త్వరలోనే అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఓటు హక్కు వినియోగంపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. సమావేశానికి పలువురు మహిళా సర్పంచ్‌లకు బదులు వారి భర్తలు హాజరైనా అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నామమాత్రంగా 'గొల్లపల్లి' సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ శంకర్

గొల్లపల్లి: మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ నక్క శంకర్ అధ్యక్షతన సోమవారం గొల్లపల్లి మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. 13 మంది ఎంపీటీసీ సభ్యులకు గాను ఎంపీపీ నక్క శంకర్‌తోపాటు చింతం అశోక్, తూర్పాటి రాజ్యలక్ష్మి, గోవిందుల లావణ్య, గోలి లక్ష్మి, గోస్కుల రాజన్న, మధుకర్ రెడ్డి హాజరయ్యారు. ఇద్దరు సంతకం చేసి, వెళ్లిపోయారు. 27 మంది సర్పంచ్‌లకు గాను నల్ల శ్యాం, సిద్ధంకి నర్సయ్య, మానాల తిరుపతి హాజరయ్యారు. మిగతావారు డుమ్మా కొట్టారు. అయితే, ముఖ్యమైన శాఖల అధికారులు, చాలామంది ప్రజాప్రతినిధులు గైర్హాజరవడంతో సమావేశం నామమాత్రంగా సాగింది. సమావేశానికి రాని అధికారులపై చర్యలు తీసుకోవాలని సభ్యులు డిమాండ్ చేశారు. రెవెన్యూ కార్యాలయంలో సిబ్బంది కొరత తీర్చాలని రాపల్లి సర్పంచ్ శ్యాం డిమాండ్ చేశారు. ఎంపీపీ శంకర్ మాట్లాడుతూ.. మండల అభివృద్ధికి అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని సూచించారు. ఎంపీడీవో నవీన్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ గంగాధర్, ఏఎంసీ చైర్మన్ కాంపెల్లి హన్మాండ్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ముగ్గురే హాజరు.. కోరం లేక వాయిదా

• వెల్గటూర్ సర్వసభ్య సమావేశం • మంత్రి యాత్రతో హాజరుకాని మెజారిటీ సభ్యులు



పోడియం ముందు బైఠాయించిన సర్పంచ్‌లు

వెల్గటూర్: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కూనమల్ల లక్ష్మి అధ్యక్షతన శనివారం వెల్గటూర్ మండల సర్వసభ్య సమావేశం జరగాల్సి ఉంది. ఇదే రోజు ఉమ్మడి వెల్గటూర్ మండలంలోని రాజారాంపల్లి, కొత్తపేట, పడకల్ గ్రామాల్లో మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రజా ఆశీర్వాద యాత్ర ఉండటం, మెజారిటీ ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు బీఆర్ఎస్ పార్టీ వాళ్లే కావడంతో అక్కడికి వెళ్లారు. సర్వసభ్య సమావేశానికి ఎంపీపీతో సహా ఒక్క ఎంపీటీసీ కూడా రాకపోవడంతో కోరం లేక వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో సంజీవరావు తెలిపారు. ప్రజల సమస్యల కన్నా మంత్రి పర్యటనకే ప్రాధాన్యం ఇచ్చి, సమావేశం వాయిదా వేయడం పట్ల కొత్తపేట, పాతగూడూర్, సూరారం సర్పంచ్‌లు కొమ్ము రాంబాబు, జగదీశ్వర్‌రెడ్డి, లచ్చయ్య ఆగ్రహం వ్యక్తం చేస్తూ పోడియం ముందు బైఠాయించారు. ఏడాదిగా పంచాయతీలకు బిల్లులు రాక అభివృద్ధి కుంటు పడుతోందన్నారు. అభివృద్ధి పనులు పూర్తయి 6 నెలలు గడిచినా బిల్లులు చెల్లించకపోవడంతో అప్పులపాలయ్యామని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలు చెప్పుకుందామంటే మంత్రి పర్యటన ఉందని సమావేశాన్ని వాయిదా వేయడం సమంజసం కాదని పేర్కొన్నారు.

మట్టి విగ్రహాలను పూజిద్దాం



సుజిత్‌రావుకు విగ్రహం అందిస్తున్న విద్యార్థులు

ఇబ్రహీంపట్నం: పర్యావరణ పరిరక్షణకు గణేశుడి మట్టి విగ్రహాలను పూజించాలని టీపీసీసీ డెలిగేట్ సభ్యుడు కల్వకుంట్ల సుజిత్‌రావు అన్నారు. ఇబ్రహీంపట్నం మోడల్ స్కూల్ విద్యార్థులు మట్టితో తయారు చేసిన విగ్రహాలతో శనివారం ర్యాలీ తీసి, స్థానికులకు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమానికి హాజరైన టీపీసీసీ డెలిగేట్ కల్వకుంట్ల సుజిత్‌రావు విద్యార్థులను అభినందించారు. వర్షకొండ ఉన్నత పాఠశాల విద్యార్థులు మట్టితో తయారు చేసిన గణేశుడి విగ్రహాలను గ్రామంలో ఉచితంగా పంపిణీ చేశారు.

మట్టి విగ్రహాల పంపిణీ

రాయికల్: తాట్లవాయి, భూపతిపూర్ జిల్లా పరిషత్ పాఠశాలల్లో విద్యార్థులు శనివారం గణేశుడి మట్టి విగ్రహాలను తయారు చేసి, పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయులు లక్ష్మయ్య, కరుణాకర్, ఎస్ఎంసీ చైర్మన్ రాజేంద్రప్రసాద్, టీచర్లు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఏ కాంట్రాక్టు ఉద్యోగులకు మద్దతు

జగిత్యాల: సమగ్ర శిక్షా అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు రవీందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. జగిత్యాల తహసీల్ చౌరస్తాలో దీక్ష చేస్తున్న వారికి శనివారం మద్దతు తెలిపి, మాట్లాడారు. మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన 180 రోజుల ప్రసూతి సెలవులు ఇవ్వాలని, బీమా సౌకర్యం కల్పించాలని కోరారు.

'పేదల ఆత్మీయ బంధువు సీఎం కేసీఆర్'



బీఆర్ఎస్‌లో చేరినవారితో సంజయ్‌కుమార్

మల్లాపూర్: ప్రజా సంక్షేమ పథకాలు అమలు చేస్తూ పేదల ఆత్మీయ బంధువుగా సీఎం కేసీఆర్ మారారని బీఆర్ఎస్ కోరుట్ల ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సంజయ్ అన్నారు. శనివారం ముత్యంపేటలో నిర్వహించిన బీఆర్ఎస్ ఆత్మీయ సమావేశంలో 250 మంది పార్టీలో చేరగా కండువాలు కప్పి, ఆహ్వానించారు. జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ సరోజన, వైస్ ఎంపీపీ నాగేశ్, రైతుబంధు సమితి జిల్లా సభ్యుడు దేవ మల్లయ్య, సర్పంచ్ బొల్లం కృష్ణవేణి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

ఒకరికి పని కల్పించే స్థాయికి ఎదగాలి

ఇబ్రహీంపట్నం: విద్యార్థులు కష్టపడి చదివి, ఒకరికి పని కల్పించే స్థాయికి ఎదగాలని బీఆర్ఎస్ కోరుట్ల ఎమ్మెల్యే అభ్యర్థి సంజయ్ అన్నారు. శనివారం ఇబ్రహీంపట్నం మోడల్‌స్కూల్‌లో ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. ఎంపీపీ జాజాల భీమేశ్వరి, వైస్ ఎంపీపీ సోముల లక్ష్మారెడ్డి, సర్పంచ్ నేమూరి లత, ప్రిన్సిపాల్ నవీన్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరాలను వినియోగించుకోండి



మందులు అందిస్తున్న లక్ష్మీనరసింహారావు

కథలాపూర్: ఉచిత వైద్యశిబిరాలను ప్రజలు వినియోగించుకోవాలని వేములవాడ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు కోరారు. శనివారం గంభీర్‌పూర్‌లో చల్మెడ ఆనందరావు వైద్య విజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. 450 మందికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందించినట్లు తెలిపారు. 90 మందికి మెరుగైన వైద్యం అవసరమని గుర్తించామని, వారిని కరీంనగర్‌లోని ఆస్పత్రికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. ఎంపీపీ జవ్వాజి రేవతి, సర్పంచ్ పోతు సింధూజ, సింగిల్‌విండో చైర్మన్ దాసరి గంగాధర్, వైస్ చైర్మన్ శీలం మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.